క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



ప్రత్తిపాడు: ఎలుకల మందు తిన్న వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన కుంచాల నాగమ్మ (62)కు, భర్త సుబ్బారావుకు మధ్య కొంతకాలంగా మనస్పర్థలు తలెత్తాయి. దీంతో నాగమ్మ చిన్న కుమారుడు ఏసుబాబు వద్ద ఉంటోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగమ్మ ఈ నెల 26న ఎలుకల మందును టూత్ పేస్టు నీళ్లలో కలుపుని తాగింది. గమనించిన కుటుంబీకులు 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుమారుడు ఏసుబాబు ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మంచాల(చేబ్రోలు): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం మంచాల గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. మండల పరిధిలోని మంచాలకు చెందిన వై. వీరాంజనేయులు ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వైపు వెళ్తున్నాడు. పెట్రోలు బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కాలికి తీవ్ర గాయాలైన వీరాంజనేయులును 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టైరు పేలి ట్రాక్టర్ బోల్తా

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): టైరు పేలి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వ్యవసాయ కూలీలు గాయాలపాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వట్టిచెరుకూరు మండలం కోవెలమూడికి చెందిన వ్యవసాయ కూలీలు సోమవారం ఉదయం అనంతవరప్పాడులో మిర్చి, మొక్కజొన్న కోతలకు వెళ్లారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వెళ్లేందుకు ట్రాక్టర్ ఎక్కారు. అనంతవరప్పాడు– గొడవర్రు మధ్యలో టైర్ అకస్మాత్తుగా పగిలిపోవడంతో అదుపుతప్పి, పక్కనున్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కోవెలమూడికి చెందిన తోట కామేశ్వరమ్మ, తోట యలమంద, తోట సుబ్బాయమ్మ, తోట వెంకాయమ్మలకు స్వల్పగాయాలయ్యాయి. మరో ముగ్గురికి చిన్నచిన్న దెబ్బలు తగిలాయి. నలుగురిని 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, మరో ముగ్గురు స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యుల వద్ద చికిత్స చేయించుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌లో పాతిక నుంచి ముప్పై మంది వరకు కూలీలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే అదృష్టవశాత్తూ ఎవ్వరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

1 నుంచి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రచారం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రచార కార్యక్రమాలు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలియజేశారు. సోమవారం ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో బాల కార్మికుల నిర్మూలనపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో, స్టేక్ హోల్డర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలనపై జరిగే ప్రచార కార్యక్రమాలను మండల, గ్రామ స్థాయిలోని అధికారులందరూ టాస్క్ ఫోర్స్ అధికారులకు సహకరించాలని ఆదేశించారు. జిల్లాలో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు గాను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని నోడల్ అధికారిగా వ్యవహరించాలన్నారు. జూన్ 12న ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని టాస్క్‌ఫోర్స్ అధికారులతో ర్యాలీని నిర్వహించాలన్నారు.

వలంటీర్లది నిస్వార్థ సేవ

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వలంటీర్లు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కొనియాడారు. వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుచరిత మండలంలో 197 మంది వలంటీర్లకు సేవామిత్ర, ఐదుగురికి సేవారత్న పురస్కారాల్ని అందజేశారు. దుశ్శాలువా, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర అనిర్వచనీయమని తెలిపారు. నిస్వార్థంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను గ్రామాల ముంగిటకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల భూమిక కీలకమని, ప్రతి యాభై కుటుంబాలకు ఒకరిని మ్యాపింగ్ చేసి కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు పాలనలో పింఛను తీసుకునేందుకు లబ్ధిదారులు కార్యాలయాల వద్ద రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేదని, కానీ నేడు మనందరి ప్రభుత్వంలో ఒకటవ తేదీనే ఇంటివద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్లు అందిస్తున్నారంటూ వారి సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి, ఎంపీపీ చిలకా రాజ్యం, ఎంపీడీవో దీప్తి, తహసీల్దార్ నాసరయ్య, పార్టీ మండల మాజీ కన్వీనర్ మన్నవ వీరనారాయణ, స్థానిక పార్టీ నాయకులు నాదెండ్ల రామచంద్రయ్య, సోమేపల్లి శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్‌లో..

నిస్వార్థంతో కరోనా సమయంలో సైతం ప్రాణాలకు తెగించి ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని ప్రతి గడపకు అందించిన సేవకులు వలంటీర్లు అని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని 26, 27 డివిజన్ల పరిధిలోని అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, చౌడవరం, సీఆర్ నగర్, నల్లపాడు, శ్రీనివాసకాలనీల పరిధిలో పని చేస్తున్న వలంటీర్లను సోమవారం సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన వారికి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల్ని అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను అవహేళన చేసిన చంద్రబాబు నేడు దాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాడంటే ఎంతటి పటిష్టమైందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. సంక్షేమ పథకాల్ని అర్హులకు అందించడంలో వలంటీర్లు ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. ప్రతి కుటుంబంలో సమస్యలు తెలుసుకుని ప్రతి రోజు వారికి అందుబాటులో ఉంటూ జగనన్న సైనికులుగా ప్రజా సేవను చేస్తున్న ప్రతి వలంటీర్‌ను ఆమె అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, కార్పొరేటర్లు శ్యామల వెంకటరమణాదేవి, చల్లా రాజ్యలక్ష్మి, సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, కందుకూరి జ్యోతి, సచివాలయాల కన్వీనర్లు, సచివాలయాల అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత, ఎంపీపీ రాజ్యం, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

గుంటూరు రూరల్: జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని 27వ డివిజన్ నల్లపాడు శ్రీనివాసకాలనీలో స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లారు. ఆ కుటుంబంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించారు. వారి సమస్యల్ని తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా? వలంటీర్లు ఏవిధంగా పని చేస్తున్నారు? వార్డు సచివాలయాలలో కార్యదర్శులు అందుబాటులో ఉంటున్నారా? అని ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైతం జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత తమ కుటుంబాల్లో వెలుగులు వచ్చాయని, సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ప్రతి గడపకు అందుతున్నాయని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజల ఆరోగ్య భద్రతకోసం విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తుంటే ప్రతిపక్షం చంద్రబాబు, అతని దత్తపుత్రుడు మాత్రం ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, అతడి దత్తపుత్రుడుకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, తురకపాలెం సొసైటీ చైర్మన్ దుగ్గెంపూడి భూపాల్‌రెడ్డి, నల్లమేకల మాధవరావు, కందుకూరి జ్యోతి, బొల్లెద్దుల వెంకట్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు కేటాయించాలి

ప్రత్తిపాడు: గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కోరారు. గుంటూరు చానల్ సాధన సమితి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు అక్షయ స్కూలులో సోమవారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘ నాయకుడు కుర్రా హరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే వర్షాధారంపై ఆధారపడిన ఈ ప్రాంతం వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, బాపట్ల జిల్లాలోని పర్చూరు మండలాల్లోని యాభైకు పైగా గ్రామాల్లో 50వేల ఎకరాల భూములకు సాగునీరు అందడమే కాక మంచినీరు కూడా లభిస్తుందని చెప్పారు. వర్షాధారంపై ఆధారపడటం వల్ల వ్యవసాయం ఒడుదుడుకులకులోనవుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి భూ సేకరణకు నిధులు విడుదల చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్‌ఇచ్చినా నిధులు విడుదల కాక పనులు ప్రారంభం కాలేదని చెప్పారు. బాపట్ల జిల్లా కలెక్టర్ పర్చూరు మండలానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన కోరారు. ఆయా ప్రాంతాల ప్రజల్ని కదిలించి, ఐక్యంగా ఉద్యమాలు చేయడం ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని లక్ష్మణరావు స్పష్టం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, కుర్రా సుబ్బారెడ్డి, రైతు సంఘ నాయకుడు కె. ఆదినారాయణ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శివనాగరాజు కాలనీలో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన బాలిక సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీకి పేదలు సమాధికడతారు

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీ

గుంటూరు రూరల్: పేదలంటే చంద్రబాబుకు చులకనని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి వారంతా రాజకీయ సమాధి కడతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో భాగంగా పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పార్టీ సీనియర్ నాయకుడు మెట్టు వెంకటప్పారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నల్లపాడులో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి రాగానే నవరత్నాల పథకాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాల్ని అందించారని తెలిపారు. చంద్రబాబు చరిత్రలో ఎన్నడూ పేదలకు సెంటు స్థలం ఇచ్చింది లేదని విమర్శించారు. తాను ఇవ్వకపోగా పేదలు చిరకాల కోరిక సొంతింటి నిర్మాణాల్ని సమాధులతో పోల్చిన నీచ సంస్కృతి చంద్రబాబుదని ఆమె దుయ్యబట్టారు. పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడు చులకన భావమేనని, వారిపై ఎన్నికల కోసం మాత్రమే కపట ప్రేమను చూపుతాడని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు టీడీపీకి పేదలంతా కలసి సమాధి కట్టాలని ఆమె పిలుపునిచ్చారు. నీచాతి నీచంగా సెంటు భూమి శవాలు పూడ్చడానికి సరిపోతుందా ? అని పేదల ఇళ్ల స్థలాల్ని అవహేళన చేసి మాట్లాడిన చంద్రబాబు నీచ సంస్కృతికి అద్దం పడుతుందని తెలిపారు. జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా సిద్ధం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, కందుకూరి జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



నల్లపాడు ప్రధాన రహదారిలో నిరసనగా బైక్ ర్యాలీ చేపడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

షుగర్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు



గృహ సందర్శనలో భాగంగా వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మేరీ యునీస్

గనికపూడి (ప్రత్తిపాడు): షుగర్ వ్యాధిపై నిర్లక్ష్యంగా ఉండరాదని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ సూచించారు. మండలంలోని గనికపూడిలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్ మేరి యునిస్ 41 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గృహ సందర్శనలో భాగంగా గర్భిణులు, బాలింతల వద్దకు వెళ్లి, వారి యోగక్షేమాల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గురై కాలికి దెబ్బతగిలి శిబిరానికి రాలేకపోయిన వృద్ధురాలి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. షుగర్ ఉన్నప్పటికీ మాత్రలు సకాలంలో వేసుకోకపోవడాన్ని గమనించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరి మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు సకాలంలో మాత్రల్ని వాడకపోతే అనర్థాలు ఎదురవుతాయని వివరించారు. ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు వీస్తుండటతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వి విజయ కుమారి, ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్మారక పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళా వేదికపై సోమవారం సాయంత్రం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో యువకళా వాహిని ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి పురస్కరించుకుని పురస్కారాల్ని ప్రదానం చేశారు. సభకు యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ కళారంగానికి సారిపల్లి కొండలరావు సేవలు ప్రశంసనీయమని తెలిపారు. అనంతరం కె.వెంకటేశ్వరరావు, వల్లూరి శివప్రసాద్, ఆలపాటి లక్ష్మి, గోపరాజు రమణ, డాక్టర్ పి.ఎస్.ఎస్.కృష్ణకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాల్ని అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం గుంటూరుకు చెందిన అమృత లహరి నిర్వహణలో నాన్న నేనొచ్చేస్తా సాంఘిక నాటిక సందేశాత్మకంగా సాగింది. డాక్టర్ డి.ఎస్.ఎన్. మూర్తి, కావూరి సత్యనారాయణ, శివశంకరశాస్త్రి, శారదా కళా సమితి అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని సంస్థ ప్రధాన కార్యదర్శి జి. మల్లికార్జునరావు, బొప్పన నరసింహారావు పర్యవేక్షించారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

పెదకాకాని: నిర్లక్ష్యంగా కారు నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని సోమవారం మృతుని బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. పెదకాకాని వెంగళరావునగర్‌కు ఎదురుగా ఈనెల 21న విజయవాడ వైపు నుంచి గుంటూరు వస్తున్న కారు డ్రైవర్ ముందు వెళుతున్న బైక్‌ని, ఆటోను ఢీకొన్నాడు. ఈ ఘటనలో గాయలపాలై చికిత్స పొందుతున్న వారిలో చేబ్రోలు మండలం సుద్దపల్లికి చెందిన మట్టుపల్లి ముత్యాలరావు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ప్రమాదం జరిగి వారం రోజులు గడుస్తున్నా నిందితుడిపై చర్యలు తీసుకోలేదంటూ మృతదేహంతో పెదకాకాని పోలీసుస్టేషన్ ఎదుట బంధువులు బైఠాయించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ధర్నాకు దిగారు. పెదకాకాని సీఐ బందారు సురేష్‌బాబు మృతుని కుటుంబసభ్యులతో చర్చించారు. రెండు రోజుల్లో నిందితుల్ని అదుపులోకి తీసుకుంటామని సర్ది చెప్పడంతో కథ సుఖాంతమైంది.



పోలీసుస్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు, కుటుంబసభ్యులు

వృద్ధురాలిపై దాడి

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలిపై కుమారుడు, కోడలు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలో నివాసం ఉంటున్న సుబ్బమ్మపై ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో మూడో కుమారుడు గురవయ్య, అతని భార్య లక్ష్మి సోమవారం దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. స్తంభాల గరువుకు చెందిన శ్రీనివాసరావు కుమార్తె భవానీతో నేలపాటి మురళీకృష్ణకు వివాహమైంది. అదుపు కట్నం కోసం మురళీకృష్ణ, తండ్రి కొండయ్య, తల్లి మహాలక్ష్మి భవానీని వేధింపులకు గురి చేశారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిల్డర్ల మోసంపై కేసు నమోదు

బిల్డర్ల మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో ఆర్.ఆర్.టవర్స్ పేరుతో షేక్ సద్దామ్ హుస్సేన్, షేక్ అబ్దుల్ కరీం అపార్టుమెంట్ నిర్మాణం ప్రారంభించారు. ఒక్కో ఫ్లాట్‌ను రూ. 45 లక్షలకు విక్రయించారు. ఫుల్ ఫర్నిషడ్ ఫ్లాట్లు అప్పజెబుతామని ఒప్పందంలో పేర్కొన్నారు. అయితే అపార్టుమెంట్‌లో ఫ్లాట్లు నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపివేశారు. బాధితుడు ఎం.సురేష్‌రెడ్డి, మరో ఎనిమిది మంది సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.